

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS


మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 20-06-2026 | సంపుటి - 29 | సంచిక -28 | రూ : 4 | పేజీలు: 8


## మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో
# కీలక ముందడుగు



- 'గాంధీ సరోవర్'కు 83 ఎకరాలిచ్చేందుకు రక్షణశాఖ అంగీకారం
- రూ.533.42 కోట్లు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్, ఆర్మీకి సీఎం రేవంత్ కృతజ్ఞతలు 2లో



## వంద మంది
# అంబేడ్కర్‌లు తయారు కావాలి

- మీరు చదువుకోండి.. మీ అన్నగా వసతులు కల్పిస్తా: రేవంత్
- గత పాలకులు విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శ
- గవర్నర్‌తో కలిసి యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్ల పంపిణీ
- డ్రగ్స్ లేని తెలంగాణను ఆవిష్కరిద్దామని ప్రతిజ్ఞ చేయించిన శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్: రాష్ట్ర భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ భాషా ప్రయుక్త లేదా పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన రాష్ట్రం కాదని.. విద్య, ఉపాధి అవకాశాల కోసం అరవై ఏళ్లు విద్యార్థులు పోరాడితే వచ్చిన రాష్ట్రమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా విద్యావ్యవస్థను మారుస్తున్నామని, కేవలం బాధ్యతగానే కాకుండా భావోద్వేగంతో పనిచేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన యంగ్ తరువాయి 2లో

**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజనబిడ్డలు ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా నాయకులుగా ఎదగాలి. వంద మంది అంబేడ్కర్‌లుగా తయారు కావాలి. మీరు చదువుకోండి.. మీ అన్నగా నేను అన్ని వసతులు కల్పిస్తా.**

## యువతకు ఉద్యోగ, ఉపాధి
# అవకాశాల కల్పనే లక్ష్యం

- దేశ యువతకు రాహుల్ భరోసా
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- గాంధీభవన్‌లో ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



హైదరాబాద్: యువతకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాల కల్పనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాన లక్ష్యమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. "నిరుద్యోగ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ దేశ యువతకు భరోసా. ఆరెస్సెస్ భావజాలం కలిగిన వ్యక్తులు యూనివర్సిటీల్లో ఉండటం వలన నీట్ వంటి ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయి. లక్షల మంది విద్యార్థులు, యువత జీవితాలు గందరగోళంలో పడ్డా మోదీకి పట్టడం లేదు" అని ఆరోపించారు. రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ తరువాయి 2లో

## 'స్మార్ట్ షెడ్యూలింగ్'కు
# ఆర్టీసీ శ్రీకారం..!

- ఇక బస్సు షెడ్యూళ్లను నిర్ణయించేది రాకపోకలే
- పాత విధానాలకు చెక్..
- రూట్లపై సమగ్ర అధ్యయనం చేయనున్న సంస్థ




2లో

## ధర్మేంద్ర ప్రధాన్
# రాజీనామా చేయాల్సిందే



- కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కార్యాలయం వరకు ఎస్ఎఫ్ఐ పాదయాత్ర
- పోలీసుల ఆంక్షలను దాటుకుంటూ నిరసన ప్రదర్శన
- పాల్గొన్న వందలాది మంది విద్యార్థులు 2లో

## రియల్ ఎస్టేట్ రంగంలోకి
# జెనరేటివ్ ఏఐ

- భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణం ఎంతో వేగవంతం
- రియల్ ఎస్టేట్ రంగంలోకి జెనరేటివ్ ఏఐ ప్రవేశం
- కొనుగోలుదారుల ఇష్టాలకు తగినట్లుగా ఇళ్ల రూపకల్పన
- నిర్మాణ వ్యయం, సమయం గణనీయంగా ఆదా
- ఈవై, క్రెడాయ్ నివేదికలో కీలక అంశాల వెల్లడి 2లో





## యార్సగూంబా
# హిమాలయాల అరుదైన సంపద

- హిమాలయన్ గోల్డ్ కోసం నేపాల్ పర్వతాల్లో మొదలైన వేట
- కిలోకు రూ.20 లక్షల వరకు ధర పలుకుతున్న యార్సగూంబా ఫంగస్
- ప్రాణాలకు తెగించి సేకరిస్తున్న వేలాది మంది గ్రామస్థులు
- అధిక సేకరణ, వాతావరణ మార్పులతో తగ్గుతున్న దిగుబడి 2లో

## జూన్ 25 నుంచి
# ఇంటింటి ఓటర్ల సర్వే




2లో

- తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు
- జూన్ 25 నుంచి ఇంటింటికి వచ్చి వివరాల సేకరణ
- సుమారు 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు
- సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష

# వంద మంది అంబేడ్కర్‌లు తయారు కావాలి

హైదరాబాద్: రాష్ట్ర భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ భాషా ప్రయుక్త లేదా పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన రాష్ట్రం కాదని.. విద్య, ఉపాధి అవకాశాల కోసం అరవై ఏళ్లు విద్యార్థులు పోరాడితే వచ్చిన రాష్ట్రమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా విద్యావ్యవస్థను మారుస్తున్నామని, కేవలం బాధ్యతగానే కాకుండా భావోద్వేగంతో పనిచేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "గత పాలకులు విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు. దీన్ని మార్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 27.50 లక్షల మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు కార్యాచరణ రూపొందించాం. పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నమూనాగా ప్రారంభించాం. విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకు నేనే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నా. ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో తెలంగాణ చరిత్రను తిరగరాద్దాం. విద్యతో పాటు అద్భుత సాంకేతిక నైపుణ్యాలతో మన తలరాతల్ని మార్చుకుందాం. ఏఐ విప్లవంతో వేల సంఖ్యలో ఉద్యోగాలు పోతున్నా..సాంకేతిక నిపుణులకు ఎలాంటి ముప్పు లేదు. నైపుణ్యాలకు పదును పెట్టండి. ఆంగ్లంతో పాటు జర్మన్, జపనీస్, కొరియన్ భాషలు నేర్చుకోండి. ఐటీ రంగంలో సిలికాన్ వ్యాలీకి దీటుగా నిపుణులను సృష్టిద్దాం. ఇక్కడే యూనికార్న్‌లు వచ్చేలా చేద్దాం. విద్యతో పాటు క్రీడల్లోనూ తెలంగాణ బిడ్డలు రాణించేందుకు అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నాం. ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి బంగారు పతకం సాధించాలన్నది నా కల. దాన్ని సాకారం చేయాల్సిన బాధ్యత మీపై (విద్యార్థులపై) ఉంది. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. గవర్నర్ శివప్రతాప్ శుక్లా మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటాం'' అని మాట్లాడారు.

*** మన విద్యార్థులకు ప్రపంచంతోనే పోటీ: భట్టి**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రపంచంతోనే పోటీ పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 27.5 లక్షల మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడం దేశ చరిత్రలోనే మైలురాయన్నారు. స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, బూట్లు వస్తువులు కాదని... తల్లిదండ్రుల హోదాలో పిల్లలకు ప్రేమతో ఇస్తున్న కానుకలని తెలిపారు.పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లల విద్య కోసం ప్రభుత్వం కృషి చేస్తోంటే... ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని.. వాటిని చూస్తే నవ్వొస్తోందన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే..

న్యూఢిల్లీ : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఎస్ఎఫ్ఐ ఢిల్లీలో పాదయాత్ర చేపట్టింది. పోలీసులు పెట్టిన అన్ని ఆంక్షలన్నింటినీ దాటుకుంటూ నిరసన ప్రదర్శనను నిర్వహించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ అవకతవకలు వంటి అంశాలను లేవనెత్తిన ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు ఎస్ఎఫ్ఐ ఆందోళనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిషేధాన్ని ఉల్లంఘించి ఆందోళన చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసుల హెచ్చరికలను చేదించి విద్యార్థులు కదంతొక్కారు. ఢిల్లీతో పాటు రాజస్తాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి విద్యార్థులు నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి వచ్చారు. శుక్రవారం హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్రను బారికేడ్లు ఉపయోగించి, విద్యార్థులను అరెస్టు చేసి విచ్ఛిన్నం చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, మాతా సుందరి కళాశాల సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను విద్యార్థులు నెట్టుకుంటూ ముందుకు సాగారు. అక్కడ నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆందోళన తీవ్రతరం కావడంతో పోలీసులు విద్యార్థుల ముందు మోకరిల్లాల్సి వచ్చింది. అనంతరం ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందాన్ని విద్యా మంత్రిత్వ శాఖకు తీసుకెళ్లేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, ప్రధాన కార్యదర్శి సృజన్ భట్టాచార్య, ఉపాధ్యక్షురాలు శిల్పా సురేంద్రన్, సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్ మంత్రిత్వ శాఖకు చేరుకుని వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం నాడు డిమాండ్లపై సవివరమైన చర్చకు మంత్రిత్వ శాఖ అధికారులు ఆహ్వానించారు. ఎస్ఎఫ్ఐ ఆందోళనను అణచివేసేందుకు ఢిల్లీ పోలీసులతో పాటు కేంద్ర బలగాలు కూడా మోహరించాయి. తుపాకులు, బాష్ప వాయువుతో బలగాలు అక్కడికి చేరుకున్నాయి. ఈ ఆందోళనను శనివారం నుంచి మరింత బలంగా ముందుకు తీసుకెళ్తామని ఎస్ఎఫ్ఐ నాయకత్వం తెలిపింది. ఈ నిరసన ప్రదర్శనలో ఉపాధ్యక్షుడు సుభాష్ జాఖర్, సంయుక్త కార్యదర్శి అనిల్ ఠాకూర్, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు సూరజ్ ఎలామన్, కేంద్ర కమిటీ సభ్యుడు అభిజిత్ మణిలాల్, ఢిల్లీ రాష్ట్ర కమిటీ సభ్యులు మెహినా ఫాతిమా, అనిల్ సేతుమాధవన్, జేఎన్‌యూఎస్‌యూ ఉపాధ్యక్షురాలు కె. గోపిక బాబు తదితరులు న్నారు.

# 'స్మార్ట్ షెడ్యూలింగ్'కు ఆర్టీసీ శ్రీకారం!

హైదరాబాద్: రాష్ట్రంలోని బస్సుల రాకపోకల్లో గణనీయంగా మార్పులు చేర్పులు జరగబోతున్నాయి. ప్రయాణికుల రాకపోకలే ఇకపై బస్సుల షెడ్యూళ్లను నిర్ణయించనున్నాయి. పాత ట్రాఫిక్ అంచనాలు, సంప్రదాయ నిర్వహణ విధానాలకు చెక్ పెడుతూ తెలంగాణ ఆర్టీసీ 'స్మార్ట్ షెడ్యూలింగ్' పేరుతో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణ ధోరణులు మారాయి. వైద్యం కోసం హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రాలకు.. ఆధ్యాత్మికత కోసం యాదగిరిగుట్ట, వేములవాడ వంటి ఆలయాలకు ప్రయాణాలు భారీగా పెరిగాయి. నగరాలు, పట్టణాల విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధి, విద్యా కేంద్రాల పెరుగుదల వంటి అంశాలూ ప్రయాణాల్లో మార్పులు తెచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించిన సంస్థ.. ప్రతి రూట్‌పై శాస్త్రీయ ట్రాఫిక్ అధ్యయనాలు నిర్వహించి అవసరాలకు అనుగుణంగా బస్సు షెడ్యూళ్లను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా అన్ని జోన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజియన్ల ఆర్ఎంలకు కీలక సర్క్యులర్ జారీ చేసింది.

*** 'రైట్ బస్..రైట్ రూట్..రైట్ టైమ్'..**

ప్రయాణికుల రాకపోకలకు సంబంధించి ప్రతి రూట్‌పై శాస్త్రీయ ట్రాఫిక్ అధ్యయనం చేయనున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా బస్సు షెడ్యూళ్ల పునర్వ్యవస్థీకరిస్తారు. కొన్ని రూట్లలో బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తుంటే.. కొన్నిచోట్ల రద్దీ తక్కువగా ఉంటున్నట్లు ఆర్టీసీ గుర్తించింది. ఉదయం, సాయంత్రం రద్దీగా ఉన్న రూట్లలో మధ్యాహ్నం ఖాళీగా వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో 'రైట్ బస్.. రైట్ రూట్.. రైట్ టైమ్' లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇకపై ప్రతి రూట్‌లో ట్రాఫిక్ ప్రారంభ సమయం, ముగింపు సమయం, రద్దీ గంటలు, ఖాళీ సమయాలు, రూట్ల వారీగా ప్రయాణికుల రాకపోకలు, ఎక్కే, దిగే ప్రాంతాల ట్రాఫిక్ సాంద్రత వంటి అంశాలపై డిపో మేనేజర్లు శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించనున్నారు.

**నగరాల మధ్య మరిన్ని బస్సులు..**

సిబ్బంది కొరత దృష్ట్యా పలు రూట్లలో సిబ్బంది ఓవర్‌టైం (ఓటీ) పనిచేస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్ జోన్లలో 2,126 ఓటీ షెడ్యూళ్లు ఉండగా.. అందులో 1,354 షెడ్యూళ్లు రెండు గంటలకు మించి ఓటీతో నడుస్తున్నాయి. నిర్వహణ వ్యయాలు పెరగడం, డ్రైవర్, కండక్టర్లు అలసిపోవడం, అప్రమత్తత తగ్గడం, భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆర్టీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు గంటలకు మించిన ఓటీ షెడ్యూళ్లను ప్రత్యేకంగా సమీక్షించి తగ్గించాలని నిర్ణయించింది. హైదరాబాద్ వరంగల్, హైదరాబాద్‌కరీంనగర్, హైదరాబాద్‌ఖమ్మం, ఖమ్మంభద్రాచలం వంటి మార్గాల్లో సింగిల్ షిఫ్ట్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించింది. దీంతో ఈ నగరాల మధ్య మరిన్ని బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అలాగే రూట్లలో 'నైట్ అవుట్' విధానం చేపడితే నాన్‌రెవెన్యూ కిలోమీటర్లను తగ్గించి, ఇంధన పొదుపు, సిబ్బంది అలసట తగ్గింపు, నిర్వహణ సామర్థ్యం పెంపు సాధ్యమవుతుందని అధికారులకు సూచించింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా నైట్‌హాల్ట్ బస్సుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జులై 31లోగా ఈ అధ్యయనం పూర్తిచేసి ఆగస్టు కల్లా కొత్త విధానాన్ని అమలుచేసి నివేదికలు పంపాలని ఆర్టీసీ యాజమాన్యం అధికారులకు సూచించింది.




# రియల్ ఎస్టేట్ రంగంలోకి జెనరేటివ్ ఏఐ

మీరు కోరుకున్నట్టుగా, మీ అభిరుచులకు తగినట్టుగా సొంత ఇల్లు నిర్మించుకోవడం ఇకపై కేవలం కల కాదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఇది త్వరలోనే నిజం కాబోతోంది. భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణం చాలా వేగంగా, తక్కువ ఖర్చుతో, కొనుగోలుదారులకు నచ్చిన విధంగా జరగనుంది. ఈ మార్పులకు జెనరేటివ్ ఏఐ సాంకేతికత నాంది పలుకుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈవైపార్థినాన్, క్రెడాయ్ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన 'జెన్‌ఏఐ ఇన్ ఇండియన్ రియల్ ఎస్టేట్' నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. రాబోయే ఏడేళ్లలో జెనరేటివ్ ఏఐ వల్ల భారత రియల్ ఎస్టేట్ రంగానికి 14 నుంచి 17 బిలియన్ డాలర్ల అదనపు విలువ చేకూరనుందని ఈ నివేదిక అంచనా వేసింది. ఇది నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయనుంది. ఏఐ టెక్నాలజీ వినియోగంతో ప్రాజెక్టుల ప్రణాళిక, డిజైన్, నిర్మాణం వంటివి వేగవంతం అవుతాయి. అమ్మకాల్లో 30-50% వృద్ధి, ప్రాజెక్టులను 30% వేగంగా ప్రారంభించడం సాధ్యమవుతుంది. భూమిని సేకరించిన నాటి నుంచి ప్రాజెక్ట్ మొదలుపెట్టే వరకు పట్టే సమయం 20-30% తగ్గుతుంది. ఫలితంగా నిర్మాణ వ్యయం, సమయం 5-20% వరకు ఆదా అవుతుంది. ఈ టెక్నాలజీతో కొనుగోలుదారుల అభిరుచులను విశ్లేషించి, వారికి తగ్గట్టుగా ఇళ్ల డిజైన్లను రూపొందించవచ్చు. ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు ఇంటిని ఎంచుకోవడంలో సాయపడతాయి. "జెన్‌ఏఐ కేవలం సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, ఇల్లు కొనే ప్రక్రియ మొత్తాన్ని మరింత మెరుగుపరుస్తుంది" అని క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ జి పటేల్ తెలిపారు. ఏఐ రాకతో సంస్థల విలువ 2-3 రెట్లు పెరిగే అవకాశం ఉందని ఈవైపార్థినాన్ ప్రతినిధి చైతన్య సేథ్ వివరించారు. మొత్తం మీద, ఏఐ ఇకపై ప్రయోగం కాదు, నిర్మాణ రంగంలో ఒక ముఖ్యమైన సాధనంగా మారబోతోంది.

# మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో కీలక ముందడుగు

హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. తెలంగాణ సర్కారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు 83 ఎకరాల భూములిచ్చేందుకు రక్షణశాఖ అంగీకారం తెలిపింది. వర్కింగ్ పర్మిషన్ ఇస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. రక్షణశాఖ నిర్ణయంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సైన్యాధికారులకు శుక్రవారం 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. మూసీ అభివృద్ధిలో కీలక మైలురాయిని చేరుకున్నామన్నారు. నిరంతరం మంచినీటి ప్రవాహంతో మూసీ నదికి పునరుజ్జీవం కల్పించడంతో పాటు నది పరీవాహక ప్రాంతాన్ని సంపద సృష్టించే ఆర్థిక నడవాగా, పర్యావరణ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.

**ఈవీఐ విధానంలో..**

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మొదటి దశ మూసీ పునరుజ్జీవ పనుల్లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రధానమైంది. బాపూ ఘాట్ త్రివేణి సంగమం వద్ద 200 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా అందుకు ప్రైవేటు భూములతో పాటు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌కు చెందిన భూములు అవసరమయ్యాయి. భూసేకరణకు ఒప్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పలు దఫాలుగా రక్షణశాఖతో సంప్రదింపులు జరిపారు. మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) లేఖలు రాసింది. స్పందనగా ఈ ఏడాది మార్చిలో రక్షణశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో గాంధీ సరోవర్ కోసం తెలంగాణ ప్రభుత్వం కోరుతున్న భూములను పరిశీలించారు. ఈ క్రమంలోనే సర్కారు అడిగిన 83.814 ఎకరాలను ఇచ్చేందుకు రక్షణశాఖ పచ్చజెండా ఊపింది. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలం బండ్లగూడ గ్రామం, రాజేంద్రనగర్ మండలంలోని హైదర్‌గూడ, గోల్కొండ మండలంలోని ఖిలా మహమ్మద్‌నగర్ గ్రామాల పరిధిలో నాలుగు భాగాలుగా ఆ భూములు విస్తరించి ఉన్నాయి. భూముల విలువను రూ.533,42,15,442గా రక్షణశాఖ అంచనా వేసింది. సమాన విలువ గల మౌలిక సౌకర్యాలు (ఈవీఐ) విధానంలో ఆయా భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు చేస్తామని రక్షణశాఖ లేఖలో తెలిపింది. అంటే.. ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంఆర్‌డీసీఎల్ తరఫున రక్షణశాఖ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది.

# యార్సగూంబా.. హిమాలయాల అరుదైన సంపద

నేపాల్‌లోని మారుమూల హిమాలయ పర్వత శ్రేణుల్లో 'బంగారు వేట' తిరిగి ప్రారంభమైంది. 'యార్సగూంబా' అనే అరుదైన ఫంగస్ సేకరణ కోసం వేలాది మంది గ్రామస్థులు ప్రాణాలకు సైతం తెగించి ఎత్తైన పర్వత ప్రాంతాలకు పయనమవుతున్నారు. 'హిమాలయన్ గోల్డ్'గా ప్రాచుర్యం పొందిన ఈ ఫంగస్, అంతర్జాతీయ మార్కెట్‌లో కిలోకు సుమారు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ధర పలుకుతోంది. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడలేని అక్కడి స్థానిక ప్రజలకు ఇదే ప్రధాన వార్షిక ఆదాయ వనరుగా మారింది. చైనా, టిబెట్ సంప్రదాయ వైద్యంలో యార్సగూంబాకు విశేష ప్రాధాన్యత ఉంది. శరీర దృఢత్వాన్ని, రోగనిరోధక శక్తిని పెంపొందించే ఔషధంగా దీనిని పరిగణిస్తారు. ముఖ్యంగా, దీనికున్న ప్రత్యేక లక్షణాల వల్ల దీనిని 'హిమాలయన్ వయాగ్రా' అనే కూడా పిలుస్తారు. ఈ ఫంగస్ సేకరణపై స్థానిక ప్రభుత్వాలు ప్రస్తుతం పలు నిబంధనలు విధిస్తూ, ప్రజల ఆదాయ మార్గాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాయి. శాస్త్రీయంగా 'ఓఫియోకార్డిసెప్స్ సినెన్సిస్' అని పిలిచే ఈ యార్సగూంబా, ఒక రకమైన గొంగళిపురుగుపై పెరిగే పరాన్నజీవి ఫంగస్. ప్రతి ఏటా మంచు కరిగిన తర్వాత మే నుంచి జూలై మాసాల మధ్య, సముద్ర మట్టానికి 3,500 నుండి 5,000 మీటర్ల ఎత్తులో మాత్రమే ఇది లభిస్తుంది. ఈ సీజన్‌లో డోల్పా, జుమ్లా, ముగు వంటి జిల్లాల్లోని గ్రామాలు దాదాపు ఖాళీ అవుతాయి. మహిళలు, చిన్నారులతో సహా కుటుంబ సభ్యులంతా ప్రతికూల వాతావరణంలోనూ తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేసుకుని దీని కోసం అన్వేషిస్తుంటారు. అయితే, ఈ 'బంగారు వేట'లో తీవ్రమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఎత్తైన ప్రదేశాల్లో ప్రాణవాయువు లోపం (ఆల్టిట్యూడ్ సిక్‌నెస్), ప్రమాదవశత్తూ జారిపడటం, ఆకస్మిక వాతావరణ మార్పుల కారణంగా గతంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, మితిమీరిన సేకరణ, వాతావరణ మార్పుల ప్రభావంతో యార్సగూంబా దిగుబడి ఏటేటా తగ్గుతోందని, ఇది పర్యావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

హైదరాబాద్: యువతకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాల కల్పనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాన లక్ష్యమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. ''నిరుద్యోగ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ దేశ యువతకు భరోసా. ఆరెస్సెస్ భావజాలం కలిగిన వ్యక్తులు యూనివర్సిటీల్లో ఉండటం వలన నీట్ వంటి ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయి. లక్షల మంది విద్యార్థులు, యువత జీవితాలు గందరగోళంలో పడ్డా మోదీకి పట్టడం లేదు'' అని ఆరోపించారు. రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మహేశ్‌కుమార్‌గౌడ్ కేక్ కట్ చేసి ప్రారంభించారు. దాదాపు వంద కంపెనీలు పాల్గొనగా.. ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకు, ఫార్మా తదితర రంగాల్లో ఉద్యోగాల కోసం వెయ్యి మందికి పైగా యువత దరఖాస్తు చేసుకున్నారు. పీసీసీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, మంత్రి సీతక్క శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పీసీసీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ కేక్ కట్ చేశారు.

# జూన్ 25 నుంచి ఇంటింటి ఓటర్ల సర్వే

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రెబ్బెనలో మిన్నంటిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజా స్ఫూర్తి, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా : రెబ్బెన మండల కేంద్రంలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ సంబరాల్లో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి, ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రజల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పోరాడుతున్న రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దుర్గ రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడం చిరంజీవి గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎర్రం తిరుపతి, పూదరి సాయిలతో పాటు పల్లె ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ చిన్న సోమశేఖర్, ముంజం రవీందర్, బొంగు నర్సింగరావు, భానోత్ రవి, సిరిసింగుల సుబ్బారావు, గుడిసెల వెంకటేశ్వర్ గౌడ్, నాగేష్, పార్వతీ సాయి, పాల్తే రవి, దిలీప్ తదితర ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా బైంసా పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పేదల నాయకుడు, ప్రజల మనిషి, ఎల్లప్పుడూ పేద ప్రజల కోసం కొట్లాడే వ్యక్తి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఆదేశానుసారం, నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ ఆదేశాను సారం, మాజీ శాసనసభ్యులు గాడ్డిగారి విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ తూర్పాటి వెంకటేష్, ఏం సి వైస్ చైర్మన్ ఎండి ఫరూక్ అహ్మద్, మాజీ జెడ్పిటిసి ఉత్తమ్ భలే రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఖాదీర్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మార్కెట్ డైరెక్టర్ భూమన్న, మాజీ వైస్ చైర్మన్ ఆసిఫ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిదాస్, సాయినాథ్, ధర్మేందర్, మౌలాఖాన్, పెద్ద నర్సయ్య, హన్మాండ్లు, లచ్చారామ్, ప్రసాద్ సళ్ళ రాజన్న, నాగేష్, నాగప్ప , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడమే కాంగ్రెస్ లక్ష్యం

**: ఎమ్మెల్యే గండ్ర**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడడమే పార్టీ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను శుక్రవారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, టౌన్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమం కోసం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలి

* **చికోడు గ్రామ పంచాయతీ ఐదో వార్డు సభ్యుడు బాద నరేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళల సంక్షేమానికి ఉద్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పట్టాలెక్కించాలని చికోడు గ్రామ పంచాయతీ ఐదో వార్డు సభ్యుడు బాద నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. ముస్తాబాద్ మండలంలోని చికోడు గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి మహాలక్ష్మి పథకం అమలు కోసం శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాద నరేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందించే హామీ కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఈ పథకాన్ని ఎలాంటి సాకులు చెప్పకుండా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ సరిత, రాజవ్వ, ఎల్లవ్వ, కనకవ్వ, కొప్పు లక్ష్మి, లత, భూమవ్వ, బైటి లక్ష్మి, గొట్టిగల్లు ఎల్లవ్వ, దేవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

* **తెల్లవారుజామున ఇంటింటి తనిఖీలు.. పత్రాలు లేని వాహనాల స్వాధీనం**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీ శుక్రవారం తెల్లవారుజామున పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్‌తో కిక్కిరిసింది. ఉదయం 5 గంటలకే కాలనీని చుట్టుముట్టిన పోలీసులు ఇంటింటికీ తనిఖీలు నిర్వహించి అనుమానితుల వివరాలు సేకరించారు. డీఎస్పీ సంపత్‌రావు ఆదేశాల మేరకు సీఐ నరేష్ నేతృత్వంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా నంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్, బీమా, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు లేని పలువురు ద్విచక్ర వాహనాలను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల గంజాయి సేవిస్తున్న ఇద్దరు, విక్రయిస్తున్న మరో ఇద్దరిని గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాలు ఇస్తే యజమానులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతో భూపాలపల్లిని గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో ముగ్గురు ఎస్ఐలు, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం: ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ 3వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టేకు రాజేశ్వరి-రాజబాబు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించిందన్నారు. 3వ వార్డులోని కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్ ఎర్రవెల్లి జలపతిరావు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో చేరండి.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేయండి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని ప్రాథమిక పాఠశాల నవాబుపేట (హెచ్/డబ్ల్యూ) ప్రధానోపాధ్యాయులు కుసునపు కిరణ్‌కుమార్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి, స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 21 వస్తువులతో కూడిన స్కూల్ కిట్లను విద్యార్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. "ప్రభుత్వ బడి - బంగారు భవిష్యత్తుకు పునాది" అనే నినాదంతో విద్యార్థుల చేరికలను మరింత పెంచేందుకు పాఠశాల యాజమాన్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొడ్డ ఆదర్శ్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, వెంకట రమణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్. కె. పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్. కె. పి. వివేకానంద్ అన్నారు. బాచుపల్లి - నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని 274వ వార్డు, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న విస్పర్ వ్యాలీ కాలనీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శుక్రవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులను అభినందించి, కాలనీ అభివృద్ధి కోసం తన సంపూర్ణ సహకారం , మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల కొరత తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, ఆయా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, 20వ వార్డు బి.ఆర్.ఎస్. పార్టీ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి నాగమణి, సోషల్ మీడియా అధ్యక్షుడు విద్యాసాగర్, మరియు సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి లీలావతి, సంయుక్త కార్యదర్శి పృథ్వీ కుమార్, కోశాధికారి రామకృష్ణ బండి, సత్యం వ్యాలీ వాసులు చిట్టిబాబు, ప్రసాద్, రామ్ ప్రసాద్, అశోక్, రదీప్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి నియామక ఉత్తర్వులను బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి వారిని నూతనంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగినది బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడకు వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానం చేయడం జరిగినది ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పడం జరిగినది వారికి ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబిసి జిల్లా నాయకులు జెనిగలశ్రీనివాస్ గౌడ్ ,జిల్లా కౌన్సిలింగ్ నెంబరు నర్సింగ్ అంజయ్య ,జిల్లా నాయకులు రావుల ఆంజనేయులు గౌడ్ , మండల సీనియరూ నాయకులు తాళ్ల నరేష్ ,మండల ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు, మండల ఉపాధ్యక్షులు నర్సింగ్ నాగ సైదులు, తెలగొర్ల వీరబాబు, అనంత్ వెంకటేశ్వర్లు, మామిడి సత్యనారాయణ, సీనియర్ నాయకులు గుగులోతు రాజు నాయక్ ,తదితరులు పాల్గొన్నారు

## కాలనీలోని ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలి

* **భైంసా ఏఎస్పీ సాయి కిరణ్**



ప్రజాస్ఫూర్తి, భైంసా : కాలనీలోని ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాపట్టణంలో పిప్రి కాలోని భైంసాలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల దిశానిర్దేశాల మేరకు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న (121) ద్విచక్రవాహనాలు,ఒక ఆటోను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు,నిషేధిత మత్తుపదార్థాల(గంజా యి) వినియోగం మొబైల్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణ నిచ్చారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు. కాలనీ వారు ముందుకు వచ్చి నేను సైతం లో భాగంగా సిసిటివి కెమెరాలను కాలనీలో ఇన్స్టాలేషన్ చేసుకోవాలని చెప్పడం జరిగింది. కాలనీ జాతీయ రహదారికి ఆనుకొని ఉంది కావున కానీ లోపటికి బయటకు వచ్చే ముందు కొద్దిసేపు ఆగి హైవే పైకి వెళ్లవలసిందిగా, సూచించినది.ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ తో పాటు, భైంసా టౌన్ ఇన్స్పెక్టర్ సాయి కుమార్, ఎస్ఐ లు నవనీత్ రెడ్డి, నాగభూషణం, దయాల్ సింగ్ , ఇతర పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణం లోని ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో భైంసా చుట్టుపక్కల ప్రాంతాలలో గల నిరుపేదలకు, ఇటుక బట్టిలలోని నిరుపేద కార్మికులకు దాదాపు 120 మందికి ఫుడ్ బ్యాంక్ భైంసా వ్యవస్థాపకులు యం ఆంజనేయులు అన్నదానం చేసి వారి ఆకలి తీర్చడం జరిగింది.ఆహారాన్ని వృధా చేయకండి.ఈసందర్భంగా మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు మాట్లాడుతూ పెళ్ళిళలో,ఇతర ఫంక్షన్లలలో మిగిలిన ఆహారాన్ని వృదాచేయవద్దని తినడానికి ఆహారం దొరకక ఎందరో నిరుపేదలు ఆకలితో అలమటిస్తూ మరణిస్తున్నారని.. దయచేసి మీ మీ ఫంక్షన్లలో ఆహారం మిగిలిపోతే మాకు 9912267973 నంబర్ కు సమాచారం ఇవ్వగలరని కోరారు.

## అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్



ప్రజాస్ఫూర్తి , ఖమ్మం జిల్లా : ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్ లో అసాంఘిక కార్యకలాపాలు మెండుగా పేరుతున్నాయంటూ ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ లో సీసీ కెమెరాలు పనిచేయకపోటంతో భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. విధుల్లో ఉండాల్సిన భద్రత సిబ్బంది కనిపించటంలేదని. ఈ పరిస్థితులను ఆసరాచేసుకొని మందుబాబులు, అసాంఘిక శక్తులు త్రిష్ట వేస్తున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ భద్రత నిర్వహణపై ఉన్నాతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరారు.

## నీట్ పరీక్షలకు
# కట్టుదిట్టమైన భద్రత



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ )2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా నిలవడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమన్నారు. మైకులు, డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. పరీక్ష సమయాల్లో ఇంటర్నెట్, జిరాక్స్, స్టేషనరీ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర పరికరాలు వెంట తీసుకురావద్దని సూచించారు. జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు, ప్రత్యేక పెట్రోలింగ్, నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, తల్లిదండ్రులు, సంఘాల ప్రతినిధులు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ముస్తాబాద్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం బిజెపి హయాంలో బలహీన పడుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి 4000 కిలోమీటర్లకు పైగా భారత్ జోడోయాత్ర నిర్వహించి కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశ ప్రజల యొక్క సాధకబాధకాలను వింటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఘనుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా మరియు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

* **డీఎంహెచ్‌వో డాక్టర్ చల్ల మధుసూదన్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు అధికారులు, వైద్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటి తొలగింపు, యాంటీ లార్వా చర్యలను ముమ్మరం చేయాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. డయేరియా నియంత్రణ ప్రచార కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ఓఆర్ఎస్, జింక్ మాత్రల వినియోగంపై అవగాహన పెంచాలని సూచించారు.ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా చూడాలని తెలిపారు. అలాగే జూలై 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గర్భిణీల ఎర్లీ రిజిస్ట్రేషన్, ఏఎన్‌సీ పరీక్షలు, హైరిస్క్ గర్భధారణల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ నాగరాణి, వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం



లింగాలఘణపురం, ప్రజాస్ఫూర్తి : మండలంలోని చౌడారం గ్రామానికి చెందిన మునిగే గట్టు మల్లయ్య (70) అనే వృద్ధుడు ఈ నెల 17వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల ప్రకారం, మల్లయ్య సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మల్లయ్య ఆచూకీ తెలిసిన వారు 8712685032 లేదా 9849601755 నంబర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు. అలాగే సమీప పోలీస్ స్టేషన్‌కు కూడా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు.

# చదువే భవిష్యత్‌కు బంగారు బాట

* **విద్యార్థులకు పలకలు, బలపాల పంపిణీ-ఎంఈఓ శంకర్**




ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత స్థానం లభిస్తాయని మెదక్ ఎంఈఓ శంకర్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం విద్యా వేడుకగా మారింది. చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిని కూడా ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్య అందించాలని పిలుపునిచ్చారు. శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు.సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, దేశభక్తి ప్రదర్శనలతో చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమణి, గౌస్ ఖురేషీ, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ అశోక్, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెల్ టవర్లు, ఫైబర్ నెట్‌వర్క్ పనులు వేగవంతం చేయాలి

* **టెలికాం సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ కె .హరిత ఆదేశాలు**



ప్రజా స్ఫూర్తి, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా : టెలికాం సేవలను మరింత మెరుగుపరిచేందుకు సెల్ టవర్ల నిర్మాణం, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.హరిత సంబంధిత అధికారులకు, టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నందున టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరైన సెల్ టవర్ల నిర్మాణం, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ పనుల పురోగతిని సమీక్షించి, భూ సమస్యలు, అనుమతులు తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు నిరంతరాయంగా కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు టెలికాం సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ వినయ్, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ తదితర టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గానుగబండ అంగన్వాడీ సెంటర్ లో ఘనంగా అక్షర అభ్యాసం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి :చిన్నపిల్లలను పాఠశాలలో చేర్పించటం కంటే ముందు అంగన్వాడి పాఠశాలలకు పంపడం వల్ల వారికి మేధోశక్తి పెరుగుతుందని అలాగే క్రియేటివ్ నాలెడ్జ్ ఉత్పన్నం అవుతుందని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల కంటే ముందు అంగన్వాడిలకు పంపించాలని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ పిల్లల తల్లి తండ్రులను కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండలం లోని గానుగబండ అంగన్వాడి 1st సెంటర్ లో అక్షరభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతనంగా అంగన్వాడీలో చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలకు తమ పిల్లలను పంపే కంటే ముందు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడి స్కూల్ కు పంపించడం ద్వారా వారి తెలివితేటలు పెరిగే అవకాశం ఉండడంతో పాటు, పిల్లలలో చురుకుదనం మరింత పెరుగుతుందని, తద్వారా విద్యలో ఉన్నతంగా రాణించడానికి అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. రాబోయే కాలంలో మరింత మంది విద్యార్థులను అంగన్వాడీ లలో చేరే విధంగా తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ తాళ్ల అనిత, అమరారపు సత్యవతి, గోధుముల లిఖిత, ఈశ్వరాచారి, హిమాంబి, అక్కమ్మ, రేణుక, తిరపమ్మ, అనూష, గోవిందమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోతుగల్ గ్రామంలో ఘనంగా
# బాలికల ఉన్నత పాఠశాల పునఃప్రారంభం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో గత 15 సంవత్సరాలుగా మూతపడి ఉన్న బాలికల ఉన్నత పాఠశాల శుక్రవారం పునఃప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముస్తాబాద్ మండల రెవెన్యూ అధికారి ఫారుక్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లచ్చాలు, మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ఈ విద్యాసంస్థను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణమంతా నూతన విద్యార్థుల రాకతో ఎంతో ఉత్సాహభరిత వాతావరణంగా మారింది. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం తర్వాత గ్రామంలో బాలికల పాఠశాల ప్రారంభం కావడం శుభపరిణామన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల ఉంటేనే గ్రామంలోని పిల్లల భవిష్యత్ బంగారుమయంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోల కృష్ణ, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు అక్కరాజు శ్రీనివాస్, గల్ఫ్ వలసదారుల సంక్షేమ విభాగం జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, వార్డు సభ్యులు జంగరాజు శేఖర్, గీసా అనిత, పాఠశాల కమిటీ చైర్మన్లు జ్యోతి వెంకటేష్, భార్గవి, వార్డు విద్యాధర్, మాచర్ల బాలయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పండు ఈగ నివారణ చర్యల పై రైతు శిక్షణ కార్యక్రమం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలో ఉన్న జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం, డాక్టర్ ఎ. ప్రశాంత్ కుమార్ శాస్త్రవేత అధిపతి అధ్యక్షతన రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఉద్యాన పంటల ప్రాముఖ్యత,ప్రత్యేకంగా కూరగాయల పంటల పై తీసుకోవలసిన జాగ్రత్తలు, పండు ఈగ నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులకు వివిధ కూరగాయల పంటల సాగు పద్ధతులు, వాటి నిర్వహణలో పాటించాల్సిన మెలకువల గురించి వివరించేందుకు షాద్‌నగర్ నుండి ముగ్గురు ప్రోగ్రెసివ్ రైతులను ఆహ్వానించారు. వారు వందల ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్న అనుభవాలను రైతులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా అమృత రాజు బృందం తమ అనుభవాలను రైతులతో పంచుకున్నారు.పండు ఈగ నివారణకు అనుసరించాల్సిన వివిధ చర్యలు, ముఖ్యంగా లింగాకర్షణ బుట్టలు ఎలా ఉంటాయి, వాటిని పొలాల్లో ఎలా వినియోగించాలి అనే విషయాలపై డాక్టర్ యు.వేణుగోపాల్ రైతులకు సవివరంగా వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర, జిల్లా ఉద్యాన అధికారి.జె.మరియన్న ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్. ప్రీతమ్ గౌడ్, కేవీకే మల్యాల శాస్త్రవేత్త ఎల్. సుహాసిని, ఉద్యాన,వ్యవసాయ శాఖల అధికారులు, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు కురగాయల సాగుకు సంబంధించిన సబ్సిడీల గురించి ఆయిల్ పామ్ సాగు, కురగాయలో ఉన్న పోషక విలువల గురించి కురగాయ పంటలో సమగ్ర సస్య రక్షణ గురించి సలహాలను సూచనలను ఇచ్చారు.

## ప్రైవేట్ ఆసుపత్రులపై ఆరోగ్యశాఖ కొరడా..!

* **మూడు రోజులుగా విస్తృత తనిఖీలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల పనితీరుపై వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించేందుకు మూడు రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు పలువురు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశాయి. జిల్లా కేంద్రంలోని కిరణ్, యోదా, మేద, స్మార్ట్ కేర్, శ్రీ వెంకటేశ్వర, ప్రధాన్ ఆసుపత్రులను సందర్శించిన అధికారులు ఫైర్ సేఫ్టీ అనుమతులు, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగులకు ప్రదర్శించాల్సిన సేవల ధరల పట్టికలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అనుమతులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ చల్ల మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రైవేట్ ఆసుపత్రులు అధికారికంగా రిజిస్ట్రేషన్ పొందాయని తెలిపారు. అన్ని ఆసుపత్రులను దశలవారీగా తనిఖీ చేసి నిబంధనల అమలును సమీక్షిస్తామని చెప్పారు. వైద్య సేవల నాణ్యతను పెంపొందించడంతో పాటు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆరోగ్యశాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

* **జిల్లా ఎస్పీ డా. శబరీష్**



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : యువతను, చిన్నారులను పొగాకు వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మహబూబాబాద్ పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పాన్ షాపుల యజమానులు, వ్యాపారులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ప్రారంభంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించారు. సిగరెట్లలో ఉండే హానికర రసాయనాలు ఊపిరితిత్తులు,గుండె, మెదడు సహా శరీరంలోని పలు అవయవాలపై చూపే దుష్ప్రభావాలను వివరించారు. పొగతాగడం,పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా విద్యార్థులు, యువత భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో చూపించే వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైనర్లకు సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ప్రతి పాన్ షాప్ వద్ద "మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించబడవు" అనే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలు కొనసాగితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాము. సమాచారానికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.సమాచారం అందించేందుకు 8712656999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు, పాన్ షాపుల యజమానులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏటీసీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

* **ఎస్ఐ ఉదయ్ కిరణ్**
* **ఐటీఐ,ఏటీసీ ప్రచార గోడ ప్రతుల ఆవిష్కరణ**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఐ.టి.ఐ, ఏ.టి.సి ప్రచార గోడప్రతులను శుక్రవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్లో జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్, ఐటిఐ ప్రిన్సిపాల్ వై రమేష్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్సు (ఏ.టి.సి ) లతో యువతకు ఎక్కువగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఉద్యోగం చేయాలన్న ఆసక్తి, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలనే తపన యువతలో ఉండాలని, అలాంటి ఆలోచనలు ఉన్న యువతకి ఈ కోర్సులు చాలా ఉపయోగపడతాయని తెలిపారు.

# లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని ఆశ భవన్ చిల్డ్రన్ హోమ్ లో మహబూబాబాద్ జిల్లా ఎస్సీ విభాగం.రాష్ట్ర కార్యదర్శి శేషం కిరణ్ ఆధ్వర్యంలో లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు తిప్పర్తి శ్రీధర్ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా తిప్పర్తి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ,సామాజిక న్యాయం,యువత,రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు శేషం కిరణ్,బల్లెం చంటి,జాన్ విక్టర్,మహేందర్,పడిదల అజిత్,బిర్రు రమేష్,చుక్క క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు ఆధ్వర్యంలో శుక్రవారం పోతారం ఎస్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు,ఉపాధి హామీ కూలీలు , కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోతారం గ్రామ సర్పంచ్ మామిడి చంద్రకళ, ఉప సర్పంచ్ పోరం అధ్యక్షులు భూమాగని రాజ్ కుమార్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెన్న రాజు,కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు భూక్య రమేష్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోతుగంటి బాలయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగారంలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : ఎంపీడీవోజి. జలంధర్ రెడ్డి శుక్రవారం నాగారం గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించిన ఆయన, లబ్ధిదారులు , మేస్త్రీలు నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే సంబంధిత అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి వారం స్థితిగతులను సమీక్షించి నివేదించాలని ఆదేశించారు. అనంతరం శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమంలో భాగంగా నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలోని పారిశుధ్యం , పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో నిల్వ ఉన్న మురుగు నీటి ప్రాంతాలు , దోమల వ్యాప్తికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం జరిగిందని నిర్ధారించారు. దోమల పెరుగుదలను నివారించి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామంలో అవసరమైన మందులు మరియు వైద్య సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామం లో ఎక్కడా డెంగ్యూ , ఇతర ఆరోగ్య సమస్యలు లేవు అని నిర్ధారించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, హెల్త్ సబ్ సెంటర్ వైద్య బృందం, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ వినియోగించాలి

* **రైతులకు ఏఈఓ శ్రీలత సూచనలు.**

అక్కన్నపేట , ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శ్రీలత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలపై ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. 50 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాతే వర్షాధార పంటల విత్తనాలు వేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో పాటు వేడి తరంగాలు పెరిగి భూగర్భ జలాల లభ్యత తగ్గవచ్చని, దీని ప్రభావం పంటల దిగుబడులపై పడే అవకాశం ఉందన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని, అధికంగా యూరియా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని రైతులకు వివరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నష్టపోతాయని, వాటిని నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. అలాగే యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని మాత్రమే యూరియా తీసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ లింక్ కానివారు లేదా యాప్‌కు సంబంధించిన సందేహాలు ఉన్నవారు రైతు వేదికను సంప్రదించాలని తెలిపారు.

# నీట్ (యూజీ)-2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

* **అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: జిల్లాలో ఈ నెల 21 ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 01 పరీక్షా కేంద్రాలలో మొత్తం 481మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి:

* ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు
* ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు
* రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో
* పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమే

**పాటించాల్సిన సూచనలు:**

* అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
* ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి
* పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

**నిషేధిత వస్తువులు:**

* స్వంత పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు తీసుకురావద్దు
* ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం, బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు.పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ)-2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష కోసం పోలీస్ శాఖ నుండి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీఓ రమాదేవి , డీఎస్పీ ప్రసన్నకుమార్ సంబంధిత రెవిన్యూ, పోలీస్, వైద్య, తపాలా, విద్యుత్, ఆర్టీసీ, రవాణా, ఎడ్యుకేషన్, అధికారులు పాల్గొన్నారు.

# నెల్లుట్ల ప్రమాద స్థలాన్ని పరిశీలించి నివారణ చర్యలు చేపట్టిన రోడ్ సేఫ్టీ అధికారులు



లింగాల ఘణపురం / జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం, నెల్లుట్ల గ్రామ సమీపం లోని జాతీయ రహదారి 163 పై ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదే శాల మేరకు రోడ్ సేఫ్టీ అధికారులు శుక్ర వా రం పరిశీలించారు. వరంగల్ రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వి.చేరాలు, హైదరాబాద్ రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ రవి, జిల్లా అసిస్టెం ట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, జాతీ య రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వా జ్ తమ బృందాలతో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే రాఘవాపూర్, మీదికొండ,గోవర్ధనగిరి క్రాస్ ప్రాంతాలను కూడా అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో రహదారి భద్రత ను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సం బంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ & ఎస్సైలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను రోడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టేందుకు అంగీక రించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# గిరిజన మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బిఆర్ఎస్ నాయకుల పై చర్యలు తీసుకోవాలి

* **ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతి నాయక్**



అక్కన్నపేట , ప్రజాస్ఫూర్తి : అక్కన్నపేట మండలంలో రామవరం గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు మహిళ గిరిజన ఉద్యోగి పై అసభ్యకరంగా ప్రవర్తించిన నాయకులను కఠినంగా శిక్షించాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం సిద్దిపేట జిల్లా అద్యక్షులు ధరావత్ తిరుపతి నాయక్ కోరారుస్త్రీలను గౌరవించవలసిన నేటి సమాజంలో స్త్రీలను సభ్య సమాజం తలదించుకునే విధంగా హేళన చేస్తూ అవహేళనను గురిచేస్తూ. అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో అనబడే అగ్రికల్చర్ ఎంప్లాయ్ పట్ల అక్కన్నపేట బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అసభ్యకరంగా ప్రదర్శించడం బాధాకరం అని, కార్యకర్తలము అని చెప్పుకుంటూ తిరిగే బిఆర్ఎస్ పార్టీ బడా నాయకులు ఒక గిరిజన ఆడబిడ్డ పట్ల అవహేళన, అసభ్య పదజాలంతో హృదయం గాయపరిచే విధంగా మాట్లాడటం, ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. భారతీయ రాష్ట్రీయ సమితి' అని చెప్పుకుని తిరిగే వారికి భారతీయ సంస్కృతి మీద ఏమాత్రం విలువలు లేవు అని తేట తెల్లం అవుతుందని సొంత ఇంటి ఆడబిడ్డను గౌరవించలేని అధినాయకత్వాల క్రింద పనిచేస్తున్న వారి ప్రవర్తన అంతకు మించి అన్నట్లుగా ఉంటుందని సాటి స్త్రీని గౌరవించలేని ఈ ఉద్యమ పార్టీ అని చెప్పుకొని తిరిగే వారు సమాజాన్ని ఎంత బాగు చేస్తారని ప్రశ్నించారు.గిరిజన మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు.

# పానీపూరి విక్రయ దుకాణాల్లో అధికారుల సంయుక్త తనిఖీలు

* **అపరిశుభ్ర ఆహార పదార్థాల తొలగింపు, పానీ నమూనాల సేకరణ**



ప్రజాస్ఫూర్తి,సిరిసిల్ల : పానీపూరి విక్రయ దుకాణాల్లో అధికారుల సంయుక్త తనిఖీలు నిర్వహించారని వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల సమయంలో, అపరిశుభ్రమైన పరిస్థితుల్లో తయారు చేసిన పూరీలు, పప్పు, నీరు అధికారులు గుర్తించారు. అపరిశుభ్రంగా ఉన్న వాటిని వెంటనే సిబ్బందితో తొలగింపజేశారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు, నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పానీ నమూనాలను కూడా సేకరించారు. తనిఖీలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖాదర్ పాషా, లోకేష్, డిప్యూటీ డీ ఎంహెచఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



జనగామ, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రె స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. డీసీసీ అధ్యక్షురాలు లకావ త్ ధన్వంతి లక్ష్మీ నారాయణ నేతృత్వా న డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నా యకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరి రక్షణ,సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని కొనియాడుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**స్టేషన్ ఘనపూర్‌లో.....**

స్టేషన్ ఘనపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసే లక్ష్యంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పార్టీ అనుబం ధ విభాగాల ప్రతినిధులు, ప్రజాప్రతి ని ధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దేశంలోని కోట్లాదిమంది యువత బిజెపి ప్రభుత్వం పట్ల నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, యువత తమ భవిష్యత్తు పట్ల ఆందోళన చెందుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, 18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎస్ ఎస్ సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో లోక్ సభ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వూర రామూర్తి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, లక్షలాదిమంది యువత నీట్ పరీక్షకు హాజరైతే పేపర్లు లీకేజి కావడంతో వారి భవిష్యత్తు అంధకారంలో పడిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనగాని రాంబాబు గౌడ్, గాలి రాంరెడ్డి, ఎలుగూరి రవి, సామ వెంకటరెడ్డి, పిడమర్తి శంకర్, కనుకు ప్రసాద్, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

# కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్ల పంపిణీ




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ జెడ్పి పాఠశాలలో చదువుతున్న బాలికలకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు కల్పనా చౌదరి విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు పాఠశాల మానేయడానికి కారణమయ్యే అంశాలలో రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా ఒకటిగా గుర్తించామని తెలిపారు. విద్యార్థినుల విద్యతోపాటు ఆరోగ్యం, భద్రత పట్ల కూడా కొల్లి ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లల హాజరు శాతాన్ని పెంచడం, వారికి రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, విద్యను మధ్యలో నిలిపివేయకుండా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థినులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, మంచి విద్యను అభ్యసించి, ఉత్తమ ఫలితాలు సాధించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కొల్లి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్, విద్యార్థినులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుండాలమ్మ తల్లి బోనాలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో గల గుండాల మిట్టలో గల గుండాలమ్మ తల్లి నాలుగవ వార్షికోత్సవం గుండాలమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండగ గా నిర్వహించారు ఉదయం 5 గంటల నుండి అమ్మవారి కి అభిషేకాలు అలంకరణ నిర్వహించి బోనాలు ఊరేగింపుగా మేళ తాళాలు డీజే చప్పులతో వచ్చి మహిళలు గ్రామ పెద్దలు పుర ప్రముఖులు అమ్మవారికి బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ అన్నదాన కార్యక్రమంలో గరిడేపల్లి గ్రామ ప్రజలు చుట్టుపక్క గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. త్రిపురం అంజన్ రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, శ్రీనివాస్, నర్సిరెడ్డి ,ఓరుగంటి శ్రీనివాస్, గ్రామ పురోహితుడు కృష్ణశాస్త్రి, గుండాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు

# జీడిమెట్ల పరిశ్రమలు మరిన్ని ఉద్యోగాలకు నాంది పలకాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్ కేపీ వివేకానంద్**






జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల పరిశ్రమలు మరిన్ని ఉద్యోగాలకు నాంది పలకాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్ కేపీ వివేకానంద్ పేర్కొన్నారు.శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ప్రోత్సాహక నగదు అందజేసి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉద్యోగ రంగంలో మరింత సమర్థవంతంగా రాణించే అవకాశం లభిస్తుందన్నారు. పీఎంవీబీఆర్‌వై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి , పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిస్తున్న యువతకు ప్రారంభ దశలో ప్రోత్సాహం అందించేందుకు ఫస్ట్ టైమర్ ఉద్యోగులకు రూ.15,000 వరకు ఒకేసారి ప్రోత్సాహక నగదు అందించడం ఈ పథకం ప్రత్యేకత అని తెలిపారు. అదనపు ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఉపాధి సృష్టిని వేగవంతం చేయడమే కాకుండా, దేశంలో అధికారిక ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో కుత్బుల్లాపూర్ జోన్ తో సహా ఈ పథకం ద్వారా 242 యజమానులు సుమారు రూ.2.39 కోట్ల ప్రోత్సాహకాలను పొందగా, 9,841 మంది ఉద్యోగులు సుమారు రూ.5.29 కోట్ల ప్రయోజనాలను పొందినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ గణాంకాలు ఉద్యోగ కల్పనలో పరిశ్రమలు , యువత చురుకుగా భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మరిన్ని సంస్థలు లబ్ధి పొందడంతో పాటు స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తయారీ రంగంలోని సంస్థలకు నాలుగు సంవత్సరాల పాటు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విస్తరణకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తోందని, ఇక్కడి పరిశ్రమలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యువతకు ఉపాధి, పరిశ్రమలకు ప్రోత్సాహం, దేశానికి అభివృద్ధి అనే త్రిసూత్రంతో ఈ పథకం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పి.ఎఫ్. కమిషనర్ సురేందర్ కుమార్, పి.ఎఫ్. ఉప కమిషనర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఎన్.ఐ.సి. హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్, జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు కె. సాయి కిషోర్ , సభ్యులు, పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉన్ని పారిశ్రామిక సహకార సంఘము అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఉన్ని పారిశ్రామిక సహకార సంఘము షాద్ నగర్ నందు సంఘము మేనేజింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్, (క్యాసెట్ శ్రీను) (షాద్ నగర్), ఉపాధ్యక్షుడిగా గోవిందు యాదయ్య(నర్సప్ప గూడ), ప్రధాన కార్యదర్శిగా ఎర్ర ఆంజనేయులు (ఎస్.బి.పల్లి), కోశాధికారిగా క్యామ నర్సిములు(షాద్ నగర్), డైరెక్టర్లుగా కొంగండ్ల పద్మమ్మ(కాకునూర్), గుండ్ల సిద్ధమ్మ(షాద్ నగర్), గౌర వెంకటయ్య(వీర్లపల్లి), ఎమ్మె వెంకటయ్య (ఎస్.బి.పల్లి), ఎదిర జంగయ్య (బోదునంపల్లి) లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘము సభ్యులు డి.నర్సిములు, గోవిందు, జంగిలి మల్లయ్య, గడ్డం సుధాకర్, రాజుల యాదయ్య, ఎమ్మె బాలరాజు, ఎమ్మె ధనవంతు, ఎర్ర రవి, పిప్పళ్ల జంగయ్య, ఎదిర వెంకటయ్య, టి.శ్రీనివాస్, క్యామ సురేష్, క్యామ శ్రీశైలం, గడ్డం వెంకటేష్, కేంద్యాల రాజేష్, క్యామ రమేష్, కేంద్యాల శేషు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిద్దులగుట్ట దేవస్థాన చైర్మన్ గా ఈదులకంటి వెంకటరెడ్డి



బచ్చన్నపేట / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట మండలం, కో డువటూర్ గ్రామం లోని ప్రసిద్ధ సిద్దుల గుట్ట దేవస్థానం నూతన చైర్మన్ గా ఈ దులకంటి వెంకటరెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకు లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్ర మానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతా ప్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపి, శాలు వాలు,పూలమాలలతో సత్కరించి అభి నందనలు తెలియజేశారు.ఈ సందర్భం గా చైర్మన్ ఈదులకంటి వెంకటరెడ్డి మాట్లాడుతూ, సిద్దులగుట్ట క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని, భక్తులకు మెరు గైన సౌకర్యాలు కల్పించేందుకు చర్య లు చేపడతానని తెలిపారు. ఆలయ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, భక్తు లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉం టానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, అధికారులు, ప్రజా ప్రతిని ధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు చేయాలి

*** కిసాన్ మేళాలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూసారాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## భైంసా ఏఎస్పి సాయి కిరణ్ ను సన్మానించిన పిఆర్ టి యుటిఎస్ సంఘా నాయకులు



ప్రజా స్ఫూర్తి, భైంసా : జిల్లాలోని భైంసా డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పత్తిపాక సాయి కిరణ్ కి పిఆర్ టి యుటిఎస్,సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.విద్యార్థులు దుర అలవాట్లు అలవర్చుకోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో బైంసా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గంగాధర్ ఎన్ కృష్ణ ముధోల్ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆహత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సలీం మహమ్మద్ ఖాన్ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ బాసర మండల కార్యవర్గ సభ్యులు కౌసర్ మరియు నాగన్న సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**– రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాల వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి స్వీకరణ, అర్హులైన ఓటర్ల వివరాల నమోదు తదితర ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్ లెవెల్ అధికారికి కార్యక్రమానికి సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్ నాథ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎలక్షన్ సిబ్బంది నవీన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

*** భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్.**

భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఐడీఓసీ కాలనీలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. జిల్లాలో భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, రీ-సర్వే, నక్షా కార్యక్రమాల పురోగతిపై వివరాలను రాష్ట్ర అధికారులకు నివేదించారు. ఈ సమావేశంలో ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసరావు, మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## గణిత బోధన, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కొడకండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్, బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా గణిత బోధనపై ఆరా తీసి, విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరిశీలించారు. గణితంలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆహారం నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వసతి గృహంలోని గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించిన ఆయన పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించి, స్కావెంజర్ అందుబాటులో ఉన్నారా అనే విషయాన్ని కూడా ఆరా తీశారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకుని, ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చిన కలెక్టర్, తన ఫోన్ నంబర్‌ను పాఠశాల,వసతి గృహ ప్రాంగణాల్లో ప్రదర్శించాలని సూచించారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కను నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కేజీబీవీ, మోడల్ స్కూల్ లలో అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి, విద్యార్థులకు స్వయంగా గణితం పై బోధించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరి శుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీసీడీఓ గౌసియా బేగం, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా

*** జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన యూరియా బుకింగ్ విధానం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచడంతో పాటు, బుకింగ్ చేసిన రైతులకు వేగవంతంగా సరఫరా చేస్తున్నామని అన్నారు. శుక్రవారం నాటికి జిల్లాలో మొత్తం 10,014 మంది రైతులు యూరియా బుకింగ్ చేసుకోగా, 39,944 బస్తాల యూరియా బుక్ చేయబడిందని, ఇందులో 28,980 బస్తాలు రైతులకు పంపిణీ చేయడం ద్వారా 72.66 శాతం సరఫరా పూర్తయిందని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 1,304.10 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పీఏసీఎస్, రైతు వేదికలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఈఓలు, ఏఓలు, మండల వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎరువుల పంపిణీని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలని, అధికంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని సూచించారు. రైతులు యూరియా బుకింగ్, సరఫరా, ఇతర వ్యవసాయ సేవలకు సంబంధించి సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు కోరారు.

## అవినీతికి తావులేకుండా పనులు పూర్తి చేయాలి

**: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



స్టేషన్ ఘనపూర్ / జనగామ, ప్రజా స్ఫూర్తి : నియోజకవర్గం లోని గ్రామాల అభివృద్ధికి రూ.13 కోట్ల విలువైన ఈజీ ఎస్, ఎస్‌డీఎఫ్ నిధుల పనులు,ఇందిర మ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పంపిణీ చే శారు. నియోజకవర్గ కేంద్రం లో నిర్వ హించిన కార్యక్రమంలో 74 గ్రామాల్లో 103 అభివృద్ధి పనులకు రూ.8.55 కోట్ల ప్రొసీడింగ్స్, 87 మంది లబ్ధిదారుల కు రూ.4.35 కోట్ల ఇందిరమ్మ ఇళ్ల మం జూరు పత్రాలను అందజేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అవినీతికి తావులేకుండా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చే యాలని సూచించారు. గ్రామాల్లో సమ స్యలను గుర్తించి ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నియోజక వర్గం రాష్ట్రం లో మూడో స్థానం లో ఉం దని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికా రులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మసాయిపేట గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శుక్రవారం యాదగిరిగుట్ట మండలం మసాయిపేట గ్రామంలో నిర్వహించిన ఫ్రైడేడ్రై డే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని, పాత సామగ్రి , ఇతర ఉపయోగించని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల లోని కిచెన్ షెడ్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు . డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సక్రమంగా తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో ,గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

## కుమ్మరిగూడెంలో రైతు రఘునందన్ ను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడకు రైతు రఘునందన్ కి చెందిన 08 ఆవుల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. షెడ్ లో బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి కొందరు మురుకుల దాన , పత్తి చెక్కలో అత్యంత నిర్లక్ష్యంగా యూరియా కలిపి, అక్కడి నుండి పరారయ్యారు. శుక్రవారం ఉదయం దానలో యూరియా కలిసిన సంగతి గమనించని యజమాని రఘునందన్ ఎప్పటిలాగే ఆవులకు ఆ మేతను వేశాడు. ఆ దాన తిన్న కొద్ది సేపటికే ఆవులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఊపిరాడక ఒకదాని తర్వాత ఒకటి విలవిలలాడుతూ కిందపడిపోయాయి.ఈ ప్రమాదంలో మొత్తం 8 ఆవులు, ఒక దూడ అక్కడికక్కడే మరణించినట్లు రైతు రఘునందన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,చంద్రకళ రాజేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రవి నాయక్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ,ప్రజాస్ఫూర్తి : భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంతో పాటు సాదాబైనామా, రీసర్వే ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పలు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీ డియో కాన్ఫరెన్స్‌లో భూధార్ సర్వే,భూ భారతి, సాదాబైనామా, నాన్‌కడాస్ట్రల్ గ్రామాల రీసర్వే, నక్షా కార్యక్రమాల పు రోగతిని ఆయన సమీక్షించారు. ఈ స మావేశంలో కొడకండ్ల తహసీల్దార్ కా ర్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధా ర్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి భూ యజమానికి సం బంధించిన వివరాలు ఖచ్చితంగా న మోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి కార్యక్రమం కింద అందిన దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరి ష్కరించాలని ఆదేశించారు. సాదాబైనా మా దరఖాస్తుల పరిశీలనను వేగవం తం చేసి అర్హులైన దరఖాస్తుదారులకు త్వరగా న్యాయం చేయాలని,భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని పేర్కొ న్నారు. నాన్‌కడాస్ట్రల్ గ్రామాల్లో కొన సాగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని గడువు లోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూమ్యా పింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని సూచించారు. భూ ముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణ కు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో తహసీల్దార్ అనిల్ బాబు, సంబంధి త రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో నాలుగు నీట్ పరీక్షా కేంద్రాలు: కలెక్టర్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. కొత్తగూడెం సింగరేణి కాలరీస్ ఉమెన్స్ డిగ్రీ, పీ.జీ కళాశాలలో 360 మంది, పాల్వంచ టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, జూనియర్ కళాశాలలో 288 మంది, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 240 మంది, కొత్తగూడెం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 240 మంది విద్యార్థులు కలిపి మొత్తం 1,128 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని వివరించారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు గంటలు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా గేట్స్ మూసేస్తారని తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డ్, ఫోటో గుర్తింపు కార్డు, రెండు ఫోటోలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తాండ్ర సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణ సాయం అందించి అదుకోవాలి

**: మోకు కనకా రెడ్డి.**



జనగామ,ప్రజాస్ఫూర్తి : మండలం లోని శామీర్‌పేట గ్రామానికి చెందిన తాండ్ర సాయిలు కుటుంబాన్ని ప్రభుత్వం తక్ష ణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం వీచిన బలమైన గాలిదుమారంతో సాయిలు ఇంటికి సమీపంలో ఉన్న రేకుల పైకప్పు ఎగిరివచ్చి ఆయన నిర్మించుకుంటున్న ఇంటిపై పడటంతో ఇల్లు తీవ్రంగా దెబ్బ తిన్నది.నిర్మాణంలో ఉన్న గోడలు కూలి పోవడంతో నిరుపేద దళిత కుటుంబాని కి భారీ నష్టం వాటిల్లింది. ప్రమాద సమ యం లో కుటుంబ సభ్యులు తృటి లో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలిపారు. రాత్రంతా విద్యుత్ లేకపోవ డంతో కుటుంబ సభ్యులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్ర వారం ప్రమాదం జరిగిన ఇంటిని సీపీ ఎం జిల్లా కమిటీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మోకు కనకారెడ్డి మాట్లాడుతూ,ఇప్పటికే ఆర్థిక ఇబ్బందు ల్లో ఉన్న కుటుంబం ఇల్లు దెబ్బతినడం తో మరింత కష్టాల్లో పడిందన్నారు.ప్ర భుత్వం వెంటనే నష్టాన్ని అంచనా వేసి ఆర్థిక సాయం అందించడంతో పాటు, అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లా అ ధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ స భ్యులు పుట్కనూరి ఉపేందర్, డీవైఎఫ్ ఐ జిల్లా నాయకులు కనకచారి, గ్రామ కార్యదర్శి తాండ్ర ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలి

**: మోకు కనకారెడ్డి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడం తో పాటు ప్రైవేటు విద్యా,వైద్య సంస్థల ఫీజులను నియంత్రించాలని సీపీఎం జి ల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి పోరు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రజల హక్కులని, కానీ ప్రస్తుతం వ్యాపారంగా మారిపోయాయ ని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి,మౌలిక సదు పాయాలు కల్పించాలని కోరారు. ప్రైవే టు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రు ల్లో వైద్య సిబ్బంది, మందుల కొరత కా రణంగా ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ప్ర భుత్వ దవాఖానాలను ఆధునీకరించి నాణ్యమైన వైద్య సేవలను అందించాల ని కోరారు. రైతులు గిట్టుబాటు ధరలు లేక, ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ పంటలకు మద్దతు ధర, నష్టపరిహారం, రుణమాఫీ, సబ్సిడీపై ఎరువులు, విత్త నాలు అందించాలన్నారు. ప్రజా సమ స్యలపై చైతన్యం కల్పించేందుకు పోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స మావేశంలో సీపీఎం జిల్లా, మండల నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

*** విత్తన,ఎరువులు దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన అధికారులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: రైతులను మోసం చేసే నకిలీ విత్తన మాఫియాపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం పోలీసులు,వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా కూసుమంచి లోని పలు విత్తన, ఎరువులు దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కూసుమంచి సిఐ సంజీవ్, వ్యవసాయ శాఖ ఏవో వాణి ,ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

*** ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్ హౌస్ లో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యని నూతనంగా ఎన్నికైన రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు కలిసారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు తనకు తెలుసునని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. పేద ప్రజలు ప్రతి నెలా సన్న బియ్యం కోసం రేషన్ దుకాణాల వద్దకు పెద్దసంఖ్యలో వస్తున్నారని, ప్రజలకు రేషన్‌ను సక్రమంగా అందజేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాద ప్రగడ కిషన్ రావు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రదాన కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్, డివిజన్ అధ్యక్షులు గార్లపాటి ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం

*** 155 మందికి వైద్య పరీక్షలు, ఆరోగ్య సంరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరో గ్య సేవలు అందించేందుకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించా రు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శిబిరాన్ని ప్రారంభించి సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇ స్తోందని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న సిబ్బందికి రక్తపోటు, షుగర్, ఈసీజీ, సీ బీపీ, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షి యం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారికి నేత్ర ప రీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.ఎరికాన్ టీపీఏ హెల్త్ ఇన్సూరెన్స్ అనుసంధానం తో యశోద హాస్పిటల్స్, మ్యాక్స్ విజన్, పాత్‌కైండ్ ల్యాబ్స్‌కు చెందిన నిపుణులైన వైద్యులు సేవలు అందించారు. మొత్తం 155 మంది సిబ్బంది, ఈ ఆరోగ్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.భాస్కర్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.డి నూరుద్దీన్ తోపాటు సెర్ప్,ఎంజీఎన్ఆర్ ఈజీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్లకు నూతన పరికరాలను అందజేసిన జిల్లా ఎస్పీ




ప్రజా స్ఫూర్తి, భైంసా : జిల్లా పోలీసు శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన,సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో శుక్రవారం నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు బార్‌కోడ్ స్కానర్లు, లేబుల్ ప్రింటర్లు, సింగిల్ డిజిట్ స్కానర్లు, ఫింగర్ ప్రింట్ బ్యూరో సిస్టమ్స్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ప్రింటర్లను పంపిణీ చేశారు.ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య పెరగడం, కంప్యూటర్లు, ట్యాబ్‌ల సాంకేతిక సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా కోర్టు కేసుల వివరాలను వేగవంతంగా నమోదు చేయడం, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు సమన్వయ అధికారులు,ప్రాసిక్యూషన్ అధికారులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీటి సహకారం అందనుంది.

*** పరికరాల ప్రాధాన్యత**

**వేలిముద్ర (ఫింగర్ ప్రింట్) స్కానర్లు**

వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడం,నేర చరిత్రను గుర్తించడం, అనుమానితుల వివరాలను తక్షణమే సేకరించడం మరియు పెండింగ్ కేసుల ఛేదనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

**సింగిల్ డిజిట్ స్కానర్లు**

పోర్టబుల్ బయోమెట్రిక్ పరికరాలైన ఇవి వ్యక్తుల గుర్తింపును క్షణాల్లో ధృవీకరించడంతో పాటు కేంద్రీకృత డేటాబేస్‌లతో సరిపోల్చి నేర చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.

**బార్‌కోడ్ స్కానర్లు**

ముద్రించిన బార్‌కోడ్‌లను డిజిటల్ సమాచారంగా మార్చి రికార్డుల నిర్వహణ, సాక్ష్యాల ట్రాకింగ్ మరియు ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేస్తాయి.

**లేబుల్ ప్రింటర్లు**

కేసు ఫైళ్లు, సాక్ష్యాధారాలు మరియు ఇతర రికార్డులను ఖచ్చితంగా గుర్తించి నిర్వహించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. తెలంగాణ పోలీస్ శాఖలో సాక్ష్యాల భద్రత, రికార్డుల నిర్వహణలో ఇవి ముఖ్యమైన సాధనాలుగా పని చేయనున్నాయి. జిల్లా పోలీస్ శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేసి,ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పరికరాలను అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తో పాటు ఏఓ యూనస్ అలీ, ఇన్స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి,సమ్మయ్య, ఆర్.ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్ రావ్ ,ఎస్సైలు జీ.లింబాద్రి , శ్రీకాంత్, రవీందర్ , గణేష్ , గోపి, శ్రావణి, హన్మండ్లు ,డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# గిన్నిస్ బుక్ అవార్డు అందుకున్న వలిగొండ యువకుడు భాష

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : జమ్మూ కాశ్మీర్ సమీపంలో నీ లడాకు వద్ద ఉన్నటువంటి పాస్ మంచు కొండలపై వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన భాష సాహస యాత్ర చేశారు. సముద్ర మట్టానికి 6 000 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కొండపై బైక్ పైన వెళ్లి తన సాహసాన్ని ప్రదర్శించారు వలిగొండ నుండి లడాకు వరకు మోటార్ సైకిల్ పై వెళ్లి అక్కడ ఉన్నటువంటి కొండలపైన చల్లటి మంచు గడ్డల్లో బైక్ పై వెళ్లి రికార్డు సృష్టించారు విజయవంతంగా కొండపైకి ఎక్కి సాహసం చేయడంతో బార్డర్స్ ఆఫ్ రోడ్స్ ఆర్గనైజేషన్ వారు గిన్నిస్ బుక్ అవార్డు సర్టిఫికెట్ను భాషకు అందజేశారు.

# చెత్త సేకరణ, ఆవుల సమస్యలను పరిష్కరించాలి

**– కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:మున్సిపల్ కార్పొరేషన్ రామవరం పరిధిలోని 15వ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేయర్ మూడు గణేష్‌కు కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ శుక్రవారం వినతి పత్రం అందించారు. రామవరం పరిధిలోని ఆరు డివిజన్లలో కలిపి సుమారు 100కు పైగా వ్యాపార దుకాణాలు ఉన్నాయని, వ్యాపార దుకాణాల నుండి చెత్తను సేకరించడానికి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా తిరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రామవరం ప్రజల, వ్యాపారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మేయర్ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# మొహర్రం పండుగను శాంతియుతంగా నిర్వహించాలి

*** వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : మొహర్రం పం డుగను ప్రశాంత వాతావరణంలో నిర్వ హించి సామరస్యాన్ని చాటాలని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్. జి ల్లా స్థాయి అధికారులు, మత పెద్దలకు సూచించారు. మొహర్రం పండుగ సంద ర్భంగా శుక్రవారం ఐడీఓసీ లో జిల్లా స్థా యి అధికారులతో పాటు ముస్లిం, హిం దూ మత పెద్దలతో శాంతి కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పండుగ వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. మత సామరస్యాన్ని కాపాడు తూ పరస్పర గౌరవం తో వేడుకలను నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, హిందూ, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ఆర్డిఓ , ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రాలు

*** వినతి పత్రాలు సమర్పించిన షాద్ నగర్ పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఎంతోమంది వ్యక్తిగత ప్రతిష్ట పెరిగే విధంగా, మరెంతో మంది వంశ ప్రతిష్ట పెరిగే విధంగా ఎన్నో అందమైన రకాల ఆభరణాలు తయారుచేసి బతుకు భారం వెళ్లదీస్తున్న స్వర్ణకారుల పరిస్థితి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మరింత దయనీయంగా మారిందని స్వర్ణకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ షాద్ నగర్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డిఓ మరియు ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం సాధించడంలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర గణనీయమైనదని సాధించిన తెలంగాణలో స్వర్ణకారుల బతుకులు బాగుపడతాయని వారు అనుకున్నారని కానీ నేడు స్వర్ణకారుల పరిస్థితి నానాటికి దిగజారిపోతున్నదని కార్పొరేట్ బడా బాబులు పెద్ద ఎత్తున పెట్టుబడులతో జువెల్లరీ షాపులు నెలకొల్పి మోసపూరిత ఆర్భాటపు ప్రకటనలతో స్వర్ణకారుల పని సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి స్వర్ణకారులను ఆదుకోవాలని, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలని, జీవో నెంబర్ 272ను సవరణ చేసి పటిష్టంగా అమలుపరిచి స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీ నుండి కాపాడాలని, 50 సంవత్సరాలు దాటిన స్వర్ణకారులకు, గీత కార్మికులకు ఇచ్చే విధంగా 5వేల రూపాయల పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడిపల్లి గోపాల్ చారి, ఉపాధ్యక్షులు దేశోజు గోవర్ధన చారి , ప్రధాన కార్యదర్శి తీగలపల్లి నరసింహ చారి , కోశాధికారి కమ్మదనం అశోక్ చారి, మధుసూదనాచారి, వెంకట్ చారి, రవి చారి లతో పాటు షాద్ నగర్ పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు మరియు స్వర్ణకారులు పాల్గొన్నారు.




# ఓటీటీలోకి మరీచిక

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ విలన్‌గా నటించిన తెలుగు మూవీ మరీచిక ఓటీటీలోకి వచ్చేసింది. శుక్రవారం అమెజాన్ ప్రైమ్‌లో రిలీజైంది. మే నెలాఖరున థి యేటర్లలో రిలీజ్ కాగా ఇరవై రోజుల్లోనే ఓటీటీలోకి వచ్చింది. కథ బాగున్నా థ్రిల్లింగ్‌గా చెప్పడంలో దర్శకుడు విఫలం కావడం, రిలీజ్ ఆలస్యం కారణంగా ప్రేక్షకులను మె ప్పించలేకపోయింది. ఎలాంటి ముందస్తు అనౌన్స్‌మెంట్ లేకుండా మేకర్స్ ఓటీటీలోకి తీసుకొచ్చారు. ఇందులో అనుపమతో పాటు రెజీనా మరో హీరోయిన్‌గా, విరాజ్ అశ్విన్ కథానాయకుడిగా కనిపించాడు. సతీష్ కాశెట్టి దర్శ కత్వం వహించగా ఇళయ రాజా మ్యూజిక్ అందించాడు.



## గవర్నమెంట్ ఆఫీసర్ పాత్రలో..

భగవంత్ కేసరి తర్వాత బాలకృష్ణతో రెండోసారి జోడీ కట్టబోతుంది కాజల్ అగర్వాల్. బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతోన్న మూవీలో ఆమె హీరోయిన్‌గా కన్ఫామ్ అయ్యింది. కాజల్ బర్త్‌డే సందర్భంగా శుక్రవారం ఆమె ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. పాతకాలం నాటి కళ్లద్దాలు ధరించి చీరలో రెట్రో స్టైల్‌లో కాజల్ ఈ పోస్టర్‌లో కనిపించడం ఆసక్తిని పంచుతోంది. ఆమె వెనుక కొన్ని రబ్బర్ స్టాంప్‌లు, ఫైల్స్ ఉన్నాయి. ఇందులో గవర్నమెంట్ ఆఫీసర్‌గా కాజల్ నటిస్తోన్నట్లు తెలుస్తోంది. షూటింగ్‌లో ఇటీవలే జాయినైంది. ఈ సినిమాలో తొలుత హీరో-యిన్‌గా నయనతారను తీసుకున్నారు. కానీ బడ్జెట్ పరమైన సమస్యల వల్ల కాజల్‌ను ఫైనల్ చేశారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం విశాఖ పేరుతో వెబ్‌సి-రీస్ చేస్తోంది ఈ అమ్మడు.

## నితిన్ మూవీ నుంచి తప్పకుందా.. తప్పించారా?

నితిన్ హీరోగా ఓ రొమాంటిక్ యాక్షన్ మూవీ రాబోతోంది. ఈ మూవీలో మిరాయ్ ఫేమ్ రితికా నాయక్‌ను హీరోయిన్‌గా తీసుకోగా సెట్స్‌లో అడుగుపెట్టకముందే తప్పుకుందట. రెమ్యూనరేషన్ ఇష్యూస్‌తోనే ఆమె నో చెప్పినట్లు వార్తలొస్తున్నాయి. అంగీకరించిన దానికంటే ఎక్కువగా రెమ్యూనరేషన్ డిమాండ్ చేయడంతో మేకర్స్ ఈ అమ్మడును పక్కనపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె స్థానంలో బేబీ ఫేమ్ వైష్ణవిచైతన్యను హీరోయిన్‌గా సెలెక్ట్ చేసినట్లు సమాచారం. హీరోయిన్ మార్పుపై అఫీ-షియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ ప్రారంభ వేడుకలో నితిన్‌తో పాటు రితికా కూడా పాల్గొన్నది.



## నేనో బటర్‌ఫ్లై..

కరుప్పు మూవీతో దాదాపు పదేళ్ల గ్యాప్ తర్వాత పెద్ద హిట్టు అందుకున్నాడు సూర్య. ఈ మూవీ తర్వాత తెలుగు మూవీ విశ్వనాథ్ అండ్ సన్స్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను మేకర్స్ శుక్ర-వారం రిలీజ్ చేశారు. నేనో బటర్‌ఫ్లై అంటూ సాగిన రొమాంటిక్ సాంగ్‌ను కిస్సిక్ ఫేమ్ సుభాషిణి ఆలపించగా జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం సమకూర్చారు. రఫ్ అయిన నువ్వు.. టఫ్ అయిన నేను.. మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే అంటూ సాగే లిరిక్స్ క్యాచీగా ఉండడంతో యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. రవీనా టాండన్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సార్, లక్కీ భాస్కర్ ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.





## లక్కీ ఛాన్స్ కొట్టేసిన ఫోక్ డ్యాన్సర్

తెలంగాణ ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ తెలుగులో బంపరాఫర్ అందుకుంది. డైరెక్టర్ సుకుమార్ సినిమాలో హీ-రోయిన్‌గా కనిపించబోతున్నది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో వెరైటీ కాన్సెప్ట్‌తో తెరకెక్కనున్న మూవీలో ప్రియదర్శితో ఆడిపాడనుంది. ఇటీవలే వీరిద్దరిపై ఓ లుక్ టెస్ట్ కూడా చేశారట. జూలై నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ మూవీతో డైరెక్టర్‌గా వంశీరెడ్డి ఇండస్ట్రీకి పరి-చయమవుతున్నారు. సుకుమార్‌తో పాటు బన్నీవాసు మరో నిర్మాతగా వ్య-వహరించబోతున్నారు. ఆమె నటించిన పేరుగల్ల పెద్దిరెడ్డి, తిన్నా తీరం పడుతలే, కాపోల్ల ఇంటికాడ సాంగ్స్ యూట్యూబ్‌లో వందల మిలియన్లకు-పైగా వ్యూస్ దక్కించుకున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.